ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం, 13 జూలై 2024 www.prajaaswaram.com 2PM



# అరికెపూడి వంతు..

## మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జంప్..

### కాంగ్రెస్‌లోకి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

### సీఎం రేవంత్ సమక్షంలో చేరిక

### కారుకు మరో ఎదురుదెబ్బ

హైదరాబాద్, జూలై 13 (ప్రజాస్వరం): అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసిన బీఆర్ఎస్ పార్టీకి వరుస షాక్ లు తప్పడం లేదు. కాంగ్రెస్ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ ఎఫెక్ట్ తో ఇప్పటికే 8 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. తాజాగా, శనివారం గ్రేటర్ పరిధి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ నివాసానికి వెళ్లిన ఆయనకు ముఖ్యమంత్రి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. కాగా, శుక్రవారం రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా గంటల వ్యవధిలో అరికెపూడి గాంధీ హస్తం గూటికి చేరడం సంచలనంగా మారింది. మరోవైపు గ్రేటర్ పరిధిలోని మిగతా ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరతారని ప్రచారం జరుగుతున్న వేళ ఎప్పుడు ఎవరూ కాంగ్రెస్ పార్టీలో చేరతారనేది సస్పెన్స్ గా మారింది. ఇప్పటి వరకు కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 9కి చేరింది. ఇప్పటికే కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, దానం నాగేందర్, కాలె యాదయ్య, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ కుమార్, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్ లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.



# 11:02

## బీజేపీకి షాక్

## 7 రాష్ట్రాల ఉప ఎన్నికల ఫలితాలు

### ఇండియా కూటమికి 11.. ఎన్డీఏకు 2 స్థానాలు

### 13 అసెంబ్లీ స్థానాలకు కొనసాగుతున్న ఓట్ల లెక్కింపు

### ఏకపక్షంగా ఫలితాలు.. సత్తా చాటుతున్న ప్రతిపక్ష కూటమి

న్యూఢిల్లీ, జూలై 13 (ప్రజాస్వరం): దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమికి షాక్ తగిలింది. శనివారం నిర్వహిస్తున్న కౌంటింగ్లో 11 చోట్ల ఇండియా కూటమి అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికార ఎన్డీయే, విపక్ష ఇండియా కూటమి ఎదుర్కొన్న తొలి పరీక్ష ఇదే కావడంతో వీటిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలవగా.. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల సరళి ప్రకారం 11 చోట్ల ఇండియా కూటమి అభ్యర్థులు, రెండుచోట్ల ఎన్డీయే అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్ లో సీఎం సతీమణి విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్ లోని 4, హిమాచల్ ప్రదేశ్ లోని మూడు, ఉత్తరాఖండ్ లోని రెండు, పంజాబ్, బిహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్ లోని ఒక్కో స్థానానికి జులై 10న ఉప ఎన్నిక పోలింగ్ జరిగింది. ఇందులో నాలుగు రాష్ట్రాల్లో ఇండియా కూటమి అధికారంలో ఉండగా.. మరో మూడుచోట్ల ఎన్డీయే ప్రభుత్వం ఉంది.

**ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం..**

- పంజాబ్‌లోని జలంధర్ స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మోహిందర్ భగత్ విజయం సాధించారు. సమీప భాజపా అభ్యర్థి శీతల్ పై 37వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- పశ్చిమబెంగాల్‌లోని మానిక్ తలా, బాగ్దా, రాణాఘాట్ దక్షిణ్, రాయ్గంజ్ స్థానాల్లో టీఎంసీ అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు.
- హిమాచల్ ప్రదేశ్ లోని దేహ్రాలో రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సతీమణి, కాంగ్రెస్ అభ్యర్థి కమలేశ్ ఠాకుర్ విజయం సాధించారు. తన సమీప భాజపా అభ్యర్థిపై 9వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నాలాగఢ్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యంలో కొనసాగుతుండగా.. హమీర్‌పుర్‌లో భాజపా నేత ముందంజలో ఉన్నారు.
- ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగలౌర్.. రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు.
- మధ్యప్రదేశ్‌లోని అమర్‌వాడా స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ధీరన్‌షా ముందంజలో ఉన్నారు.
- బిహార్‌లోని రూపౌలి స్థానంలో జేడీయూ అభ్యర్థి ఆధిక్యంలో కొనసాగుతున్నారు.
- తమిళనాడులోని విక్రావండిలో డీఎంకే నేత అన్నియుర్ శివ ముందంజలో ఉన్నారు.

## నిజామాబాద్ జిల్లాలో హోంగార్డు ఆత్మహత్య

నిజామాబాద్, జూలై 13 (ప్రజాస్వరం): నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రైలు కిందపడి హోంగార్డ్ ఆత్మహత్య చేసుకోవడం చర్చనీ యాంశమైంది. శనివారం ఉదయం రోజు వారిగా డ్యూటీ కి వెళ్తున్నా నని ఇంట్లో చెప్పి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.రైల్వే ఎస్సై కథనం ప్రకారం... నిజామాబాద్ నగరంలోని ఎల్లమ్మ గుట్ట ప్రాంతానికి చెందిన గుమ్మడి దార్ల సంపత్ కుమార్ (43) హోంగార్డుగా విధులు నిర్వ ర్తిస్తున్నాడు.గత కొన్ని రోజుల నుంచి విధులకు హాజరు కాలేదు. ఆరోగ్య పరిస్థితి బాగా లేనందున తాగుడికి బానిసై అప్పుల బాధతో జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య తెలిపినట్లు ఎస్సై తెలిపారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేపడుతున్న ట్లు పోలీసులు తెలిపారు.

## ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం..

## హైదరాబాద్ కి చెందిన ముగ్గురు మృతి

ఒడిశా, జూలై 13 (ప్రజాస్వరం): ఒడిశాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ కు చెందిన ముగ్గురు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఒడిశాలో బస్సు ప్రమాదం జరగగా.. నగరానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. పాతబస్తీ ఛత్రినాక నుంచి తీర్థయాత్రకు 23 మంది భక్తులు వెళ్లారు. బరంపురం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ట్రావెల్స్ బస్సు మరో వాహనాన్ని ఢీకొట్టింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





## బాలికల హాస్టల్లో కుప్పకూలిన స్లాబ్

వరంగల్, జూలై 13 (ప్రజాస్వరం): హనుమకొండ జిల్లాలోని కాకతీయ యూనివర్సిటీ పోతన బాలికల హాస్టల్ అర్ధరాత్రి కుప్పకూలింది. అయితే అదృష్టవశాత్తూ ఆ సమయంలో గదిలో ఎవరూ లేరు. కొద్దిరోజుల క్రితం ఫ్యాన్ కిందపడి విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ ఘటనలతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. కాగా, హాస్టల్ ను పరిశీలించడానికి వచ్చిన రిజిస్ట్రార్ ను విద్యార్థినులు అడ్డుకుని నిలదీయడంతో ఉద్రిక్తత నెలకొంది.

## జీతాలు ఇవ్వలేదని కిడ్నాప్

### సాఫ్ట్ వేర్ కంపెనీ పేరిట 1,500 నియామకం

### యజమానిని ఎత్తుకెళ్లిన ఉద్యోగులు

హైదరాబాద్, జూలై 13 (ప్రజాస్వరం): మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదనే ఆగ్రహంతో సంస్థ ఉద్యోగుల్లో కొందరు తాము పనిచేస్తున్న సాఫ్ట్వేర్ సంస్థ సీఈవోనే కిడ్నాప్ చేశారు. జూబ్లీహిల్స్లో ఈ ఘటన జరిగింది. అపహరణకు గురైంది ఇన్ ఆర్బిట్ మాల్ ఎదురుగా ఉన్న టీ హబ్లో గిగ్లియాస్ సంస్థ సీఈవో రవిచంద్రారెడ్డి. ఆయన జూబ్లీహిల్స్లోని హుడా కాలనీలో నివస్తున్నారు. ఈ నెల 10న రాత్రి ఇంట్లో స్నేహితుడు మోహన్, తల్లి మాధవితో కలిసి రవిచంద్రారెడ్డి డిన్నర్ చేస్తుండగా ఆయన ఇంటిముందు ఓ కారు ఆగింది. అందులోంచి దిగిన కొందరు నేరుగా ఇంట్లోకి ప్రవేశించారు. రవిచంద్రారెడ్డి, మోహన్ను బలవంతంగా తమతో తీసుకుపోయారు. రవిచంద్రారెడ్డి కారును కూడా తీసుకువెళ్లారు. మాధవిని ఇంట్లోనే నిర్బంధించారు. మరుసటి రోజు మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటపడ్డ మాధవి, ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్ఫోన్ సిగ్నల్స్, సీసీ ఫుటేజీ ద్వారా నిందితుల కార్లు బెంగళూరు హైవే మీదుగా వెళ్లినట్లు గుర్తించారు. రవిచంద్రారెడ్డి, మోహన్లను నాగర్కర్నూల్లోని ఓ హోటల్లో బంధించినట్లు తెలియడంతో పోలీసులు అక్కడకు వెళ్లి ఇద్దరినీ సురక్షితంగా రక్షించారు. రవిచంద్రారెడ్డిని అపహరించింది ఆయన సంస్థల్లో పనిచేస్తున్న 8మంది ఉద్యోగులని గుర్తించి.. వారిని అదుపులోకి తీసుకున్నారు. రవిచంద్రారెడ్డి సాఫ్ట్వేర్ ఉద్యోగం ఇస్తానని 1500 మందిని నియమించుకున్నారని, అందరికీ శిక్షణ ఇచ్చి మూడు నెలలుగా ఉద్యోగం చేయించుకున్నారని, జీతాలు ఇవ్వలేదని నిందితులు ఆరోపించినట్లు తెలిసింది.